క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాచినేని సత్యనారాయణ, పుస్తవరపు శ్రీను, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు అరుణోదయ సదస్సు

ఇల్లెందురూరల్: 19న ఇల్లెందులో నిర్వహించనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం పోచారం గ్రామంలో న్యూడెమోక్రసీ, అరుణోదయ నేతలు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు చిరంజీవి, భిక్షం మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సకల జనుల హక్కులను హరించి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక కుట్రలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కళాకారులపై ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి సదస్సులో కార్యక్రమం రూపొందించడం జరుగుతుందని చెప్పారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని మెయిన్ రోడ్డు హైస్కూల్ ఆవరణలో పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్యశిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, కిడ్నీ, మూత్రపిండాలు, మూత్ర వ్యవస్థ, న్యూరో, జీర్ణకోషము, పేగులు, లివరు, ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, బీపీ, షుగర్, ఈసీజీ, టూడీ ఎకో లాంటి పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తారని తెలిపారు.

శంకుస్థాపనకు రెండేళ్లు..



రాజుతండా రోడ్డు దుస్థితి

టేకులపల్లి: అధికారుల పట్టింపు లేకపోవడంతో మారుమూల ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టేకులపల్లి మండలం చంద్రుతండా పంచాయతీ రాజుతండా వయా గోప్యాతండా ఎస్డీ ఎస్‌డీఎఫ్ 2022-23 నిధులు రూ.కోటితో బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఏప్రిల్ 2023లో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా శంకుస్థాపన చేసి రెండేళ్లు దాటినా రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో చినుకు పడితే చాలు ఈ మార్గంలో రాకపోకలు నరక యాతనగా మారాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

పాల్వంచ: పాల్వంచ డివిజన్ పరిధిలోని గుడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భద్రాచలం శ్రీ నృసింహ స్వామి సేవా వాహిని సహకారంతో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎస్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరెం ప్రశాంత్ బ్యాగులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్స బాబూరావు, సోడె మధు, సోయం సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు తలసేమియా వ్యాధి గుర్తింపు కోసం పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ సూచనతో 50 మంది విద్యార్థులకు డాక్టర్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. రక్తహీనత ఎదుర్కొంటున్న విద్యార్థులకు తగు సలహాలు సూచనలు చేశారు. రక్తకణాల సంఖ్య తగ్గిపోతుందని ప్రాణాప్రాయంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పరాగ్ని, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

25 నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

టేకులపల్లి: 25, 26, 27 తేదీలలో టేకులపల్లి మండలం పి.కొత్తతండా (ముత్యాలంపాడు) గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠాచార్యులు శ్రీరంగం అజయ్ సాయి చక్రి ఆధ్వర్యంలో 25న మంగళవాయిద్యాలతో గ్రామంలో తోరణాల అలంకరణ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, జలాధివాసం, తీర్థ ప్రసాద వినియోగం, 26న పుణ్యాహవచనం, క్షీరాధివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ధాన్యాదివాసం, హోమం, అష్టదిగ్బంధనం, 27న ఉదయం 9.22లకు బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ఠా మహోత్సవ వేడుక ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా స్పెషల్ డ్రైవ్

- రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు
- వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు
- దోమల నియంత్రణకు డివిజన్లలో ఫాగింగ్

'సాక్షి' ఫోన్ ఇన్‌లో కేఎంసీ కమిషనర్ కె.సుజాత



ఉద్యోగులతో కలిసి ఫోన్ ఇన్‌లో పాల్గొన్న కమిషనర్ సుజాత



సాక్షి ఫోన్ ఇన్

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం నేపథ్యాన నిలిచి ఉన్న నీటితో దోమలు, ఆపై సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశమున్నందున ఫాగింగ్ చేపట్టడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కమిషనర్ కె.సుజాత తెలిపారు. అలాగే, అవసరమైన చోట రోజువారీ ప్రాతిపదికన కార్మికులను నియమించి స్పెషల్ డ్రైవ్ చేపడుతామని వెల్లడించారు. చెత్త, పిచ్చిమొక్కలు తొలగించేలా ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, కార్పొరేషన్‌లో విలీనమైన సుజాతనగర్‌లోని డివిజన్లలో కూడా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు. ×సాక్షి℮ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పాల్గొన్న ఆమె ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమేకాక పలు సమస్యలను పరిష్కారం చూపారు. ఈ మేరకు ప్రజలు ఫిర్యాదులు, కమిషనర్ ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: డ్రెయినేజీలు శుభ్రం చేయక దోమలు పెరిగిపోతున్నాయి. **- ఎస్ఎస్.రాజు, హనుమాన్‌బస్తీ**

కమిషనర్: సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేకంగా శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నాం. డ్రెయినేజీల్లో సిల్ట్ నిలవకుండా తీయిస్తాం.

ప్ర: బస్తీలో మెయిన్‌రోడ్డు మీదనే షెడ్ వేస్తున్నారు, దాని వలన ఇళ్ల దగ్గరకు ఫైరింజన్ వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. **- వెంకట్, ప్యూన్‌బస్తీ**

క: టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి, ఎంక్వైరీ చేయించి ఆక్రమణ కట్టడం అని తెలితే వెంటనే నిర్మాణం తొలగిస్తాం.

ప్ర: పశువులు రోడ్డు మీద ఎక్కువ ఉంటున్నాయి. దీని వలన ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రామవరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. **- రాజ్‌కుమార్, రామవరం**

క: పశువులకు సంబంధించి యజమానులకు నోటీసులు పంపించాం. వారి ఇళ్లకు వారు తీసుకెళ్లకుంటే వాటిని గోశాలకు తరలిస్తాం. ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించి పోలీసు వారికి తెలియజేస్తాం.

ప్ర: పాతకొత్తగూడెంలోని వీధులలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది, పిల్లలను, వృద్ధులను కరుస్తున్నాయి. **- ఆంధ్రవాణి, పాతకొత్తగూడెం**

క: వీధులలో కుక్కలను పట్టించి ఎనీమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలిస్తాం. వాటి సంఖ్య పెరగకుండా సర్జరీ చేయించే కార్యక్రమం చేపడతాం. ప్రస్తుతం వీధులలో వాటి బెడద లేకుండా ఉండేందుకు గానూ పాతకొత్తగూడెంతో పాటుగా అన్ని ఏరియాలలో పట్టించే కార్యక్రమం చేపడుతాం.

ప్ర: ప్యూన్‌బస్తీలో చెత్త తొలగించడం లేదు. మూడు, నాలుగు ట్రాక్టర్ల చెత్త నిల్వ ఉంది. దీని వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. **- పిల్లి కుమార్, ప్యూన్‌బస్తీ**

క: నిల్వ ఉన్న చెత్తను పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి తొలగింపజేస్తాం. రెగ్యులర్‌గా చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్ర: సుజాతనగర్ మెయిన్ రోడ్డులో లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం **- జగన్, సుజాతనగర్**

క: సుజాతనగర్ మెయిన్ రోడ్డులో లైట్ల ఏర్పాటు కోసం టెండర్ పిలిచాం. ఏర్పాటు చేయిస్తాం.

ప్ర: కార్పొరేషన్ కార్యాలయంలో టాయిలెట్స్ పని చేయడం లేదు. **- రఘుమాచారి, కొత్తగూడెం**

క: పైపులైన్ వ్యవస్థ జామ్ అయింది. పనులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తాం.

ప్ర: కూలీలైన్ ఏరియా, మసీదు లైన్‌లో కుక్కలు 10 మందిని కరిశాయి. స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. **- విజయ, కూలీలైన్**



క: కుక్కలను పట్టించేందుకు ప్రత్యేక వాహనాన్ని పంపించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం.

ప్ర: రోడ్డును ఆక్రమించి షెడ్ నిర్మాణం చేశారు. **- మారపాక రమేష్, ప్యూన్‌బస్తీ**

క: రోడ్డు ఆక్రమించి షెడ్ నిర్మాణం చేసిన విషయంపై ఎంక్వైరీ చేయించాం. మళ్లీ మరోసారి ఎంక్వైరీ చేయించి రోడ్డు ఆక్రమణ అయితే తొలగిస్తాం.

ప్ర: రోడ్డుకు ఇరువైపులా చెత్తను తొలగించడం లేదు. బ్లీచింగ్ వేయడం లేదు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి చాలా రోజులు అవుతుంది. ఇంకా ప్రారంభించ లేదు. **- ఎండీగౌస్, గంగభిషన్‌బస్తీ**

క: రోడ్డుకు ఇరువైపుల పేరుకపోయిన చెత్తను వెంటనే తొలగింపజేయిస్తాం. శంకుస్థాపన అయిన రోడ్లకు నిర్మాణం జరిగే విధంగా చూస్తాం.

ప్ర: వీధిలైట్లు వెలగడం లేదు, డ్రెయినేజీలలో సిల్ట్ తొలగించడం లేదు. **- జయరాంరెడ్డి, వేపలగడ్డ**

క: వచ్చే వారం కల్లా వీధి లైట్ల సమస్య పరిష్కరిస్తాం. డ్రెయినేజీలలో కూడా సిబ్బంది చేత సిల్ట్ తొలగింపజేయిస్తాం.

ప్ర: కోమటిపల్లిలో సైడ్ కాలువలలో మట్టి నిండిపోయి ఉంది. లైట్లు వెలగడం లేదు. **- భూక్యా రాజేష్, కోమటిపల్లి**

క: స్పెషల్ శానిటేషన్ పెట్టించి డ్రెయినేజీలలో మట్టిని తొలగింపజేస్తాం. త్వరలో వీధిలైట్లను కూడా ఏర్పాటు చేయిస్తాం.

ప్ర: సుజాతనగర్ పంచాయతీ ఆఫీసు దగ్గర చెట్లు, గడ్డి విపరీతంగా పెరిగిపోయింది. దీని వలన దోమలు విపరీతంగా వస్తున్నాయి. **- సతీష్, సుజాతనగర్**

క: శానిటేషన్ సిబ్బందిని పంపించి పెరిగిన చెట్ల పొదలను తొలగింపజేస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం చేపడుతాం.

ప్ర: పాల్వంచ గట్టాయిగూడెంలో ఖాళీ ప్లాట్లలో చెత్త పెరిగిపోయింది, దోమలు వస్తున్నాయి. **- కొండలరావు, గట్టాయిగూడెం**

క: ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేసి పెరిగిన చెట్లను తొలగించే విధంగా చూస్తాం. ప్రభుత్వ ప్లాట్ అయితే సిబ్బంది చేత తొలగిస్తాం.

ప్ర: వేపలగడ్డలో డ్రెయినేజీ సమస్య బాగా ఉంది. దీని వలన చాలా ఇబ్బందులు పడుతున్నాం. **- తులసిరెడ్డి, వేపలగడ్డ**

క: శానిటేషన్ సిబ్బందిని పంపించి డ్రెయినేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

ప్ర: రామవరంలో డ్రెయినేజీ జామ్ అయి మురుగు వెళ్లడం లేదు. **- రామశంకరయ్య, రామవరం**

క: శానిటేష్ సిబ్బంది చేత చర్యలు తీసుకుంటాం.

ప్ర: రామవరం సీఆర్పీ క్యాంపులో డ్రెయినేజీ నిర్మాణం సగం వరకే చేసి వదిలివేశారు. మిగతాది నిర్మించకపోవడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నాం. **- అశోక్, సీఆర్పీ క్యాంపు**

క: డ్రెయినేజీ నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పెట్టి నిర్మాణం జరిగే విధంగా చేస్తాం.

ప్ర: ఫ్లెక్సీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. **- సతీష్, పాల్వం**

క: అనుమతి లేని ఫ్లెక్సీలు, ప్రమాదాలకు కారణం అవుతున్న ఫ్లెక్సీలను గుర్తించి వెంటనే తొలగిస్తాం.

ప్ర: పాతపాల్వంచలో డ్రెయినేజీ బ్లాక్ అయింది. అదేవిధంగా ఖాళీ స్థలాలలో చెట్లు పెరిగి దోమలు వస్తున్నాయి. **- శేఖర్‌రెడ్డి, పాతపాల్వంచ**

క: డ్రెయినేజీలలో సిల్ట్‌ను తొలగించి నీరు ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం, ఖాళీ స్థలాలలో కూడా చెట్లు తొలగింపజేయిస్తాం.

ప్ర: సుజాతనగర్‌కు వచ్చే తాగునీరు ఫిల్టర్ కావడం లేదు, వీధి లైట్లు వెలగడం లేదు. **- కేశవరావు, సుజాతనగర్**

క: వాటర్ ఫిల్టర్‌పై చర్యలు తీసుకుంటాం. వీధి లైట్లను త్వరలో ఏర్పాటు చేయిస్తాం.

ప్ర: కొత్తగూడెం బూడిదగడ్డ ఏరియాలో కేకే టవర్స్‌కు డ్రెయినేజీ లేకపోవడం వలన ఆ నీరంతా స్థానికంగా ఉండే వారి ఇళ్ల దగ్గరకు వస్తోంది. **- సాంబశివ, బూడిదగడ్డ**

క: టవర్స్ వారికి నోటీసులు జారీ చేసి డ్రెయినేజీ నీరు ఇళ్లలోనికి రాకుండా చర్యలు తీసుకుంటాం.

తక్షణ స్పందన

'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకున్న కమిషనర్ సుజాత కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మేదరబస్తీ, హనుమాన్‌బస్తీ నుంచి డ్రెయినేజీల సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఫోన్ ఇన్ ముగియగానే వెంటనే సిబ్బందిని పంపించి డ్రెయినేజీల్లో సిల్ట్ తీయించారు. ఈ మేరకు సాక్షితో పాటు కమిషనర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



మేదరబస్తీలో సిల్ట్ తొలగిస్తున్న సిబ్బంది

మంత్రికి ఘనంగా స్వాగతం

జూలూరుపాడు: జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం భద్రాచలం వెళ్తూ పడమటనర్సాపురంలో కొద్దిసేపు ఆగారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు లేళ్ల గోపాల్‌రెడ్డి నివాసం వద్ద మంత్రి శ్రీనివాసరెడ్డి ఆగి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసేందుకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మంత్రి మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

లైసెన్స్‌లు పునరుద్ధరించుకోవాలి..



మిల్లర్లతో మాట్లాడుతున్న రాంబాబు

ఇల్లెందు: రైస్ మిల్లర్లు ట్రేడింగ్, ప్రాసెసింగ్‌కు సంబంధించి తప్పనిసరిగా మార్కెట్ నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలని, లైసెన్స్‌లు ఉన్న వ్యాపారులు వాటిని పునరుద్ధరించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు తెలిపారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్కెట్ ఆదాయం పెంచేలా వ్యాపారులు సహకరించాలని కోరారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో అనుమతి కలిగిన మిల్లర్లు మాత్రమే ట్రేడింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీలు సుజిత, నరేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎర్రబోరులో ఉచిత వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: దంతలబోరు గ్రామపంచాయతీలో ఆదివాసీ గిరిజనులు నివాసం ఉంటున్న ఎర్రబోరులో శుక్రవారం ఉచిత ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'ఎర్రబోరులో జ్వరాలు'శీర్షికకు జగన్నాథపురం పీహెచ్‌సీ వైద్యులు రాజు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణయ్య, ఎంఎల్ హెచ్‌పీ రాజ్యలక్ష్మి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆషాఢమాసం.. గోరింట సంబురం

ఇల్లెందురూరల్: ఆశాఢమాసం పురస్కరించుకొని 21పిట్ ఏరియా భూపేష్‌నగర్‌లో గోరింట వేడుకను స్థానిక మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయమే గ్రామంలో గోరింటాకు సేకరించారు. గ్రామ కూడలిలో సమష్టిగా ఆకులను రోటిలో నూరుతూ పాటలు పాడుతూ సంబురంగా నూరి గోరింటను సిద్ధం చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా గ్రామంలోని మహిళలు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ప్రతీఒక్కరు నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. అనంతరం పండిన చేతులను చూసుకుంటూ ముచ్చటపడ్డారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు మహిళలు మాట్లాడుతూ.. అరచేతిలో గోరింటాకు పెట్టుకుంటే శరీరంలో ఉన్న వేడి బయటకు వెళ్లి చల్లగా మారుతుందని పేర్కొన్నారు. పెళ్లి కాని అమ్మాయిలకు గోరింటాకు ఎంత ఎర్రగా పండితే.. అంత మంచి భర్త వస్తాడనే నమ్మకం పూర్వ నుంచి ఉందని గుర్తుచేశారు. వర్ష రుతువులో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.



గోరింటాకు పెట్టుకున్న మహిళలు

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): కారుణ్య నియామకాల కోసం ఇటీవల మెడికల్ అన్‌ఫిట్ అయిన జీకే ఓసీ, ఆర్‌సీహెచ్‌పీ ఉద్యోగుల పిల్లలకు కొత్తగూడెం ఏరియా లెవల్‌లో డిపెండెంట్ కమిటీ సభ్యులు శుక్రవారం సాక్షుల సమక్షంలో ఏరియాలో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.ప్రహ్లాద్ మాట్లాడుతూ... మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికులు తమ వివరాలను పారదర్శకంగా వివరిస్తే మీ పిల్లలకు మెడికల్ పరీక్షలు నిర్వహిస్తామని, ఆధారాలు సక్రమంగా లేకపోతే, మళ్లీమళ్లీ కౌన్సెలింగ్, విచారణ చేయాల్సి వస్తుందని ఉన్నది ఉన్నట్లు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు, డీజీఎం పర్సనల్ జి.మోహన్‌రావు, సీనియర్ పీఓ మజ్జి మురళీ, కే.దేవదాస్, అరవింద్ పాల్గొన్నారు.

గూడెంలో ఘనంగా బోనాల జాతర



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తగూడెంటౌన్: ఆషాఢమాస సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలోని శ్రీశ్రీశ్రీ మహాకాళీ అమ్మవారి బోనాల జాతరను కాళీ ఉపాసకులు ఉప్పు నరేంద్రభవానీ స్వామి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, నెత్తిన బోనాలు పెట్టుకుని మహిళా భక్తులు, కళాకారుల నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ అమ్మవారి రథం ఊరేగింపుతో వీధులన్నీ భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారికి అభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన, హోమం పూజలను వేద మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.





బోనాల జాతర సందర్భంగా కొత్తగూడెం వీధుల్లో కళాకారుల నృత్యాలు

అదనంగా యూరియా విక్రయ కేంద్రాల ఏర్పాటు

ఇల్లెందురూరల్: యూరియా విక్రయాలు జరుగుతున్న వ్యవసాయ మార్కెట్ యార్డులో రద్దీ తగ్గించేందుకు అదనంగా రెండు విక్రయ కేంద్రాలను సోమవారం ప్రారంభిస్తామని ఏడీఏ లాల్‌చంద్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. చల్లసముద్రం, కొమరారం కేంద్రంగా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం పంటల సాగు, మొక్కల ఎదుగదలను బట్టి ఇప్పటి వరకు విక్రయించిన యూరియా సరిపోతుందన్నారు. కానీ యూరియా కొరత ప్రచారం కారణంగా ముందస్తుగా కొనుగోలు చేసేందుకు రైతులు విక్రయ కేంద్రానికి అధిక సంఖ్యలో తరలిరావడం వల్లే సమస్యలు వస్తున్నట్లు తెలిపారు.

21న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆవునూరి మధు

సింగరేణి(కొత్తగూడెం): యూరియా కొరత నివారకు పోరాటాలు సాగిద్దామని, ఈనెల 21న చలో కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని న్యూడెమొక్రసీ కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏర్పడిన యూరియా కొరతను నివారించాలని రైతులందరికీ ప్రభుత్వమే సరిపడా యూరియా సరఫరా చేయాలని, విత్తనాలు వేసుకున్న రైతులకు యూరియా అందకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈ ఏడాది కాలం సక్రమంగా కాక విత్తనాలు వేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు యూరియా కూడా సమయానికి అందకపోవటం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. కుటుంబంతో సహా తెల్లవారుజామున రెండు గంటలకే యూరియా కోసం క్యూలో రాత్రి 10 గంటల వరకు నిలపడితే మూడు బస్తాల చొప్పున ఇస్తే పంటకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వంలో క్యూలో నిలపడి యూరియా కోసం మృతి చెందిన రైతుల గురించి ప్రతిపక్షంలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు అధికారపక్షంలో ఉండి కూడా అట్లనే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, కే.సారంగపాణి, డి.ప్రసాద్, ఎన్.సంజీవ్ పాల్గొన్నారు.

కష్టాల సాగులో.. నష్టాల దిగుబడి

- అన్నదాత దరిచేరని ప్రోత్సాహకాలు
- జాడలేని ఉద్యానశాఖ అధికారులు
- విక్రయ సౌకర్యం లేక దళారులకు పంటల అప్పగింత



పందిరిపై కాకరతీగ

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామానికి చెందిన వాంకుడోత్ బాలు సుమారు 20 ఏళ్లుగా కూరగాయల సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా చీడపీడల విధ్వంసం, పెట్టుబడి భారంతో నష్టాలు చవిచూశాడు. ఇతర పంటల పరిస్థితి కూడా అలానే ఉండటంతో ఈ ఏడాది జనవరిలో టమాట సాగు చేశాడు. దీనికోసం రూ.1.50 లక్షలు పెట్టుబడి అయింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో కష్టాలు తీరుతాయని ఆశించాడు. కానీ విక్రయ సౌకర్యం లేక దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వచ్చింది. చివరకు కన్నీళ్లు దిగమింగుకుంటూ నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి. ఇది ఒక్క బాలుక వ్యథ కాదు.. మండలంలో కూరగాయల సాగు చేస్తున్న రైతులందరికీ ఎదురవుతున్న అవస్థ.

గతమెంతో వైభవం..

సాధారణ పంటల సాగుతో వరుస నష్టాలను చవిచూసిన రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఒక్కొక్కరుగా సాగు చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు. దీనికి తోడు నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం రైతులకు కలిసొచ్చింది. ఆ తరువాత వచ్చిన పాలకులు రాయితీ సౌకర్యాలను పెంచడంతో కూరగాయల విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. ఐటీడీఏ ఒక అడుగు ముందుకేసి రైతులకు విత్తనాలతోపాటు పందిరి, మార్కెట్ వరకు కూరగాయల రవాణాకు అవసరమైన వాహనాలను కూడా సబ్సిడీ ధరలలో అందించింది. దీంతో రాయితీ సౌకర్యాలను అందిపుచ్చుకున్న రైతులు క్రమంగా సాగు విస్తీర్ణం పెంచుతూ.. ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది.

దారి చూపని ఉద్యాన అభివృద్ధి పథకం..

గతంలో కూరగాయల సాగు కోసం సబ్సిడీపై నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను రైతులకు అందించేవారు. దీంతో రైతులు విస్తతంగా సాగు చేశారు. 2016 నుంచి సబ్సిడీ విత్తనాలకు మంగళం పాడటంతో సాగు 40 శాతానికి పడిపోయింది. దీనికితోడు నాలుగేళ్లుగా చీడపీడలు విజృంభించడంతో సాగు విస్తీర్ణం మరింతగా తగ్గిందిది. కాగా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు 2024 కేంద్ర ప్రభుత్వం సమీకృత ఉద్యాన అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ ఈ పథకం నేటికీ రైతుల దరికి చేరకపోవడం విడ్డూరం.

ముఖం చూపని ఉద్యాన అధికారులు..

ఏటా ఏప్రిల్ నుంచే ఉద్యాన పంటల సాగు ప్రారంభమవుతుంది. తొలిపంటగా కాకర విత్తనాలను ఏప్రిల్‌లో విత్తుకుంటారు. జూన్ రెండో వారం నాటికి పంట చేతికందుతుంది. ఆ తరువాత అదే పందిరిపై బీర, సొర వంటి ఇతర తీగ జాతి పంటలను సాగు చేస్తుంటారు. వీటితోపాటు బెండ, టమాట, వంకాయ, క్యాబేజీ తదితర పంటలను రైతులు సాగు చేయడం అనాదిగా కొనసాగుతోంది. గతంలో ఉద్యానశాఖ అధికారులు గ్రామాలలో పర్యటించి పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై సూచనలిచ్చేవారు. కానీ మూడేళ్లుగా ఉద్యాన శాఖ అధికారుల పర్యటనలు లేకపోవడం రైతులు పురుగు మందుల వ్యాపారుల సూచనలపై ఆధారపడాల్సి వస్తోంది.

అందని గిట్టుబాటు ధరలు...

గిట్టుబాటు ధర కలగానే మారింది. బహిరంగ మార్కెట్‌లో బీర కిలో రూ.80 వరకు విక్రయిస్తున్న వ్యాపారులు రైతు నుంచి మాత్రం రూ.25 నుంచి రూ.30 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కాకర, బెండ, టమాట వంటి దిగుబడుల పరిస్థితి ఇలాగే ఉంటోంది. ఈ పరిస్థితిలో స్వయంగా విక్రయించుకునేందుకు ఇల్లెందులో రైతు బజార్లు, దిగుబడి దాచుకునేందుకు శీతల గిడ్డంగి సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులు, దళారులు అడిగిన ధరకు పంటలను విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.


పెట్టుబడి భారంగా మారింది..



పందిరి సాగుకు గతంలో కర్రలు వినియోగించేవాళ్లం. అటవీశాఖ అభ్యంతరంతో సిమెంటు స్తంభాలు వినియోగిస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూళ్ల అమాంతం పెరిగి పెట్టుబడి భారంగా మారింది. చివరకు దళారులు చెప్పిన ధరకు విక్రయించి నష్టాలు చూస్తున్నాం.

- మంచె రమేష్, రైతు, కొమరారం

అధికారుల జాడే లేదు..



దశాబ్దకాలంగా కూరగాయల సాగు చేస్తున్నాం. గతంలో ఉద్యాన రైతులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రోత్సహించేవారు. ప్రోత్సాహకాలను అందించి సాగు విస్తీర్ణం పెంపుకు తోడ్పడ్డారు. మూడేళ్లుగా అధికారుల జాడే లేదు. చీడపీడలు అధికమై, దిగుబడి తగ్గి గతేడాది సాగు నిలిపివేశాం.

- వాంకుడోత్ లింగా, అమర్‌సింగ్‌తండా